క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు



కృత్తివెన్ను: బాపట్లలో మూడురోజుల పాటు జెడ్పీటీసీలకు నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయి. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మైల రత్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, పాలనాపరమైన విధానాలపై శిక్షణ ఇచ్చారని చెప్పారు. శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

బంటుమిల్లి: మల్లేశ్వరం ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. గత రెండు సంవత్సరాలుగా ఉప సర్పంచ్‌గా ఉన్న 7వ వార్డు సభ్యుడు గంగుమోలు నాగరాజు తొలుత చేసుకున్న ఒప్పందం మేరకు పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఎన్నికల అధికారి నోటిఫికేషన్‌ను అనుసరించి ఉప సర్పంచ్ పదవికి ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈఓపీఆర్‌డీ రాజేశ్వరి సమక్షంలో జరిగిన పాలకవర్గ సభ్యుల సమావేశంలో ఉప సర్పంచ్‌గా 8వ వార్డు సభ్యురాలు కందుల నాగేశ్వరమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన నాగేశ్వరమ్మను ఎన్నికల అధికారితోపాటు సర్పంచ్ సీహెచ్ శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి శివకుమారి, పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

నేటి నుంచి పైడమ్మ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి ఆలయంలో పైడమ్మ అమ్మవారి నూతన ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తామని ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు గణపతి పూజ, వివిధ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు హోమాలు, ఉదయం 7.35 గంటలకు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు అనంతరం అమ్మవారి దర్శనం ఉంటుందని వివరించారు.

అదనపు గది నిర్మాణానికి శంకుస్థాపన

పెడన: తోటమూలలోని జయలక్ష్మీ పీఏసీఎస్‌లో అదనపు గది నిర్మాణానికి సంఘ త్రిమెన్ కమిటీ చైర్మన్ వరుదు రామకృష్ణ, ఉమాదేవి దంపతులు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.2 లక్షలతో ఈ గది నిర్మాణం చేపట్టారు. శంకుస్థాపన అనంతరం చైర్మన్ రామకృష్ణ దంపతులు పీఏసీఎస్ కార్యాలయం మార్గంలోని దివంగత వైఎస్సార్ విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు.

ర్యాంపు పనుల పరిశీలన

పెడన: మచిలీపట్నం రోడ్డులోని రామరాజు చానెల్ వంతెన సమీపంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ర్యాంపు నిర్మాణ పనులు చేపట్టారు. పనులను మున్సిపల్ కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల గోపీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కోమట్ల అనిల్, వన్నం రామారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ కిట్లు అందజేత

పెడన: పెనుమల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు ఉన్న వైఎస్సార్ కిట్లను వారి బంధువులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గరికిపాటి వెంకట రామానాయుడు, ఎంపీటీసీ వుచా ఆదిసూర్యనారాయణ, సచివాయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నాగాయలంక ఎంపీడీఓగా శ్రీనివాసరావు

నాగాయలంక: నాగాయలంక ఎంపీడీఓగా సీహెచ్ శ్రీనివాసరావు నియమితులయ్యారు. చందర్లపాడు మండలంలో ఈఓపీఆర్డీ విధుల్లో ఉన్న ఆయనను పదోన్నతిపై నాగాయలంకకు బదిలీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించిన కార్యాలయ సూపరింటెండెంట్ వేమూరి శ్రీనివాసరావు విజయవాడకు బదిలీ అయ్యారు.

చల్లపల్లి ఎంపీడీఓ బాధ్యతల స్వీకారం

చల్లపల్లి: సమష్టిగా పని చేసి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు సాధిస్తామని చల్లపల్లి మండల నూతన ఎంపీడీఓ సీహెచ్ చిన్నరాట్నాలు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందారు. తాజా బదిలీల్లో చిన్న రాట్నాలు చల్లపల్లి ఎంపీడీఓగా నియమితులై గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈఓలు వడమట సుకుమార్, ఆకుల సాంబశివరావు, బీవీ సుబ్బారావు, కొండవీటి చంద్రహరీష్, పిట్టి రాంబాబు స్వాగతం పలికి సత్కరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ అరుణకుమారి బాధ్యతలు అప్పగించారు. అనంతరం జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణిని ఎంపీడీఓ మర్యాదపూర్వకంగా కలిశారు.

అమలులోకి పెరిగిన భూముల ధరలు

- పెడన పట్టణంతో పాటు 13 గ్రామాల్లో అమలు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు చేపట్టిన సబ్ రిజిస్ట్రార్లు

పెడన: పట్టణానికి చెందిన ఇళ్లు, భవనాల నిర్మాణ భూములు, వాణిజ్య భూములు, వ్యవసాయ భూముల ధరలు పెరిగాయి. కరోనా నేపథ్యంలో 2019 తరువాత 2023 మే 31వ వరకు ధరలు పెంచలేదు. ప్రస్తుతం కూడా సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని 20 శాతం గ్రామాల్లో పెంచాలని, అది కూడా ఆదాయం అధికంగా ఉన్న రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఆ దిశగా ఉన్నతాధికారులు అడుగులు ముందుకు వేసి 30 శాతం ధరలు పెంచారు. పెడన నియోజకవర్గంలోని పెడన, బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. పెడన సబ్ రిజిస్ట్రార్ పరిధిలో 35 గ్రామాలు, ఒక పట్టణం ఉండగా వీటిల్లో పెడన పట్టణంతో పాటు నాలుగు గ్రామాలు, బందరు మండలంలో రెండు, బంటుమిల్లి మండలంలో ఒక గ్రామంలో భూమి ధరలు పెరిగాయి. అలాగే బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని బంటుమిల్లి మండలంలో నాలుగు, కృత్తివెన్ను మండలంలో మూడు గ్రామాల్లో ధరలు పెరిగాయి. ఈ గ్రామాలు కాకుండా మిగిలిన వాటిల్లో భూముల ధరలు పెరగలేదు. అయితే ప్రతిపక్ష పార్టీలు, అవగాహన లేని వారు మాత్రం అన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయని గోబెల్ ప్రచారం చేస్తున్నారని, దీంతో రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్‌లు చేయించుకునేందుకు తక్కువ మంది వస్తున్నారనే విషయాన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది పేర్కొనడం విశేషం.



పెడన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఎక్కడెక్కడ భూముల ధరలు పెరిగాయంటే...

పెడన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని పెడన పట్టణంతో మండలంలోని కొంకేపూడి, నడుపూరు, నందమూరు, బందరు మండలం హుస్సేన్‌పాలెం, అరిసేపల్లి గ్రామాలు, బంటుమిల్లి మండలం ముంజులూరులో ధరలు పెరిగాయి. మార్కెట్ విలువ పెరిగింది. బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో బంటుమిల్లి మండలంలో ఆర్తమూరు, బంటుమిల్లి, పెదతుమ్మిడి, పెందుర్రు గ్రామాలున్నాయి. కృత్తివెన్ను మండలంలో చినపాండ్రాక, కృత్తివెన్ను, లక్ష్మీపురం గ్రామాల్లో భూముల మార్కెట్ విలువ పెరిగింది. గజం ధర రూ.5 వేలు ఉంటే రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు ధర పెరిగింది. అలాగే సెంటు భూమి రూ.8.40 లక్షలు ఉన్నది రూ.12 లక్షలు అయింది.

తగ్గిన లక్ష్యాలు...

పెడన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో నిరుడు ఆదాయ లక్ష్యం రూ.13.15 కోట్లు నిర్ణయించగా రూ.12.48 కోట్లు మాత్రమే వచ్చింది. ప్రస్తుతం ఈ ఏడాది కూడా రిజిస్ట్రేషన్లు బాగా తగ్గాయనే వాదన వినిపిస్తోంది. ఆన్‌లైన్ చేయడంతో రాష్ట్రంలో ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేస్తుండటం వల్ల ఆదాయం అనుకున్నంతగా రావడం లేదనే భావన ఉంది. బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ పరిధిలో రూ.9.74 కోట్లు లక్ష్యానికి రూ.7.19 కోట్లు మాత్రమే వచ్చింది.

ఉన్నతాధికారుల ఆదేశాలతో పెంపుదల



రెవెన్యూ అధికంగా ఉన్న వాటిపై దృష్టి పెట్టి వాటిల్లోనే భూముల మార్కెట్ విలువ 30 శాతం పెంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 36 రెవెన్యూ గ్రామాల్లో 20 శాతం గ్రామాలను మాత్రమే ఎంపిక చేయాలని నిబంధన పెట్టారు. ఆ ప్రకారం ఏడు గ్రామాలను ఎంపిక చేశాం. ఇందులో పెడన పట్టణం కూడా ఉంది. 2020 నుంచి ధరలను పెంచలేదు. జాయింట్ కలెక్టర్‌తో పాటు రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులతో సమావేశాల అనంతరం ఫైనలైజ్ చేశాం. తాజాగా పెంచిన ధరలను జూన్ ఒకటి నుంచి అమలు చేస్తున్నాం. ఆన్‌లైన్ చేయడం ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేకపోతున్నాం.

– ఆర్. రామచంద్రశేఖరరావు, సబ్ రిజిస్ట్రార్, పెడన

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

యూనియన్ బ్యాంక్ జీఎం వికాష్‌కుమార్

మచిలీపట్నంటౌన్: పట్టాభి మెమోరియల్ గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందే అభ్యర్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వికాష్ కుమార్ అన్నారు. స్థానిక పట్టాభి సంస్థను జీఎంతో పాటు డెప్యూటీ జనరల్ మేనేజర్ మురళీ పార్థసారథి, మచిలీపట్నం రీజనల్ హెడ్ వెంకట్రావు గురువారం సందర్శించారు. డీటీపీ కోర్సులో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో వారు మాట్లాడారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు స్వయంగా యూనిట్లను స్థాపిస్తే యూనియన్ బ్యాంక్ ద్వారా రుణం అందించి ఆర్థికంగా తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. సంస్థ డైరెక్టర్ విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్‌తో మాట్లాడుతున్న జీఎం వికాష్ కుమార్

జూలై ఒకటిన గిరి ప్రదర్శనకు ప్రత్యేక ఆర్టీసీ బస్

అవనిగడ్డ: జూలై ఒకటో తేదీన అవనిగడ్డ నుంచి అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసును నడుపనున్నామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. జూలై ఒకటో తేదీన అవనిగడ్డలో బయలుదేరి, రేపల్లె, బాపట్ల, చీరాల మీదుగా కాణిపాకం, సిరిపురం, అరుణాచలం వెళుతుందన్నారు. కంచి, కామాక్షిగుడి, శ్రీకాళహస్తిని దర్శించుకుని నాలుగో తేదీకి అవనిగడ్డ తిరిగి చేరుకుంటుందన్నారు. టిక్కెట్ ధర రూ.3వేలు ఉంటుందని, స్థానిక డిపోలో రిజర్వేషన్ కౌంటర్, ఏటీబీ ఏజెంట్ల వద్ద టిక్కెట్స్ రిజర్వ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 94936 10699, 99636 58630 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఘనంగా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

నడకుదురు(చల్లపల్లి): గ్రామంలోని గొడపాలెంలో జంపాన వారి ఇలవేల్పు అంకమ్మ తల్లి నూతన దేవాలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. నూతన దేవాలయంలో జంపాన వారి అంకమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కమిటీ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సజ్జా బలరామకృష్ణ, జంపాన రత్తయ్య పాల్గొన్నారు.



అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పమిడిముక్కల: మండలంలోని అమీనపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠలు వైభవంగా జరిగాయి. దుర్గా, మల్లేశ్వరస్వామి, వినాయకుడు, ఇతర పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠలు, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠలు చేశారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎంపీపీ కాసాని వేద సుప్రజ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు గ్రామంలోని హనుమాన్ సీతా లక్ష్మణ పరివార సహిత కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు క్షత్రియ రామాలయం ప్రాంగణం రంగులతో, విద్యుద్దీప కాంతులతో వేడుకకు ముస్తాబైంది. సీతా రామ్ గురుదేవుల అనుగ్రహంతో వైఖానస ఆగమ శాస్త్ర రీతిలో విష్వక్సేన పూజ, విశేష హోమాలు, యంత్రస్థాపనలు అనంతరం ఉదయం 7.56 నిమిషాలకు స్వామి వార్ల ప్రతిష్ఠలు, పంచవింశతి కుంభాభిషేకాలు, కళావహన, శ్రీ స్వామి వార్ల శాంతి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరగనున్నట్లు రామాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చిందా వెంకటేశ్వర్లు రాజు, గ్రామ మాజీ సర్పంచ్ చిందా వీర వెంకటనాగేశ్వర రాజు, బోరుకాటి ప్రసాదరాజు, చిందా వీర వెంకట కుటుంబరాజు తెలిపారు.

గ్రామ సచివాలయ ఈఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శిగా తుంగల

మచిలీపట్నంటౌన్: గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా తుంగల నాగేశ్వరరావు నియమితులయ్యారు. స్థానిక ఎన్జీఓ భవనంలో జరిగిన సంఘ సమావేశంలో నాగేశ్వరరావును నియమిస్తూ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. రత్నం నాగేశ్వరరావుకు నియామక పత్రాన్ని అందజేశారు. నగరంలోని 35వ డివిజన్ సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శిగా నాగేశ్వరరావు పనిచేస్తున్నారు. రత్నం మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కలపాల దినేష్‌తేజ, కోశాధికారి ఎడ్ల నాగరాజు, సంఘ నాయకులు టిజ నాగశ్రీను, సురేష్ పాల్గొన్నారు.



నాగేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న రత్నం, దినేష్‌తేజ

పది సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతం

పెడన: పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు గురువారం జరిగిన సోషల్ పరీక్షతో ఆరో రోజుకు చేరాయి. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా జరిగాయని డీఈవోలు తెలిపారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 2,329 మందికి 1,638 మంది హాజరయ్యారని, 691 మంది గైర్హాజరయ్యారని డీఈఓ తాహెరాసుల్తానా తెలిపారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎనిమిది పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలను తనిఖీ చేశారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 4,097 మందికి 3,103 మంది హాజరుకాగా 994 మంది గైర్హాజరయ్యారని డీఈవో సీవీ రేణుక తెలిపారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయని చెప్పారు.

పోల్‌రాజ్ కెనాల్ గట్లకు మరమ్మతులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రధానమైన పోల్‌రాజ్ కాలువ గట్టు గండ్ల పూడ్చివేత, ముళ్ల పొదల తొలగింపు కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. పశువులు కాలువలోకి అధిక సంఖ్యలో దిగడం కారణంగా నీటి ఒరవడికి కాలువ గట్లు కోతకు గురయ్యాయి. సుమారు 3 కిలోమీటర్ల మేర అక్కడక్కడా కాలువగట్లపై గండ్లు ఏర్పడి మట్టి జారి కాలువలోకి పడిపోతోంది. గట్లపై దట్టంగా ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో గట్లు పటిష్టం చేసేందుకు, ముళ్లకంపలు తొలగించేందుకు రూ.7 లక్షలతో పనులు చేపట్టినట్లు ముదినేపల్లి సెక్షన్ నీటి పారుదలశాఖ ఏఈఈ ఈకేవీ కిషోర్ తెలిపారు.

షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

బంటుమిల్లి: పెందుర్రు గ్రామంలోని షిర్డీ సాయి మందిర 20వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారి ప్రధాన మూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పండితులు ఐలూరు కిషోర్ శిష్య బృందం వేద మంత్రాల మధ్య ప్రత్యేక హోమాలు, హారతులు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయి భక్త కమిటీ వారు పర్యవేక్షించారు.

పెడన పీహెచ్‌సీ తనిఖీ



పెడన: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి గురువారం సాయంత్రం పెడన పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, అటెండెన్సు రిజిస్టర్లను తనిఖీ చేశారు. మలేరియా మాసోత్సవాలు ఎక్కడెక్కడ జరిగాయి.. జరుగుతున్నాయనే వివరాలతో పాటు అంగన్‌వాడీలలో నిర్వహించే డయేరియా వారోత్సవాలు, పీహెచ్‌సీల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ఆరా తీశారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు తెరుస్తున్న నేపథ్యంలో మానసిక దివ్యాంగులు, రుగ్మతలున్న విద్యార్థులను గుర్తించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పెడన పీహెచ్‌సీ వైద్యురాలు మీనా దేవి, హెల్త్ ఎడ్యుకేటర్ లీలాకృష్ణ, హెచ్‌బీ మణిమ్మ, సౌదామణి పాల్గొన్నారు.

కాశీయాత్ర నిర్వాహకులకు ఘన సన్మానం



పెడన: కాశీయాత్ర నిర్వాహకుడు పిచ్చుక ఫణి కుమార్, అరుణకుమారి దంపతులను కాశీ యాత్రకు వెళ్లినవారు ఘనంగా సన్మానించారు. గురువారం రాత్రి స్థానిక గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో యాత్రికులు ఊటుకూరు నాగమయ్య, కట్టా జ్యోతీశ్వరరావు, ఆకుపు సముద్రేశ్వరరావు, దిలీప్‌కుమార్, కొసనం హేమానంద్, పుష్పకుమారి పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

చల్లపల్లి: మాదిగ రిజర్వేషన్ సాధన కోసం జూలై 7న నిర్వహించనున్న జన జాగృతి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొల్లూరి రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం చల్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎంఈఎఫ్ రాష్ట్ర కో–కన్వీనర్ కైతేపల్లి దాస్ పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

కోడూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వివేక్ అన్నారు. గురువారం మండలంలోని నరసింహపురం గ్రామంలో 104 సంచార వాహనం ద్వారా వైద్యసేవలందించారు. షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు అత్యవసర వైద్యసేవలను ఇంటి వద్దే అందించడంతో పాటు ఆరోగ్యానికి భద్రత కల్పిస్తున్నామని వివేక్ తెలిపారు. అనంతరం గ్రామంలోని 51 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, ఏఎన్‌ఎం మీనాకుమారి, డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస్ పెరుమాళ్ల, డీఎం సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

చల్లపల్లి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే తమ లక్ష్యమని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణా నాయక్ అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో రూ.కోటి 50 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్ శాఖ చల్లపల్లి సబ్ డివిజన్ డీఈఈ పులి శివ నాగేశ్వరరావు, ఏఈఈ కె.అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

మంత్రి జోగి రమేష్

పెడన: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఎంపీడీఓ వి. రెడ్డయ్యకు సూచించారు. పెడన ఎంపీడీఓగా బాధ్యతలను చేపట్టిన రెడ్డయ్య గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను పెడన పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రెడ్డయ్య మంత్రిని దుశ్శాలువాతో సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జయరాం, వైఎస్సార్ సీపీ నాయకులు రామానాయుడు, తలుపులు వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జోగి రమేష్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ

బాధ్యతల స్వీకారం..

ఎంపీడీఓ రెడ్డయ్య గురువారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు నుంచి ఆయన బాధ్యతలను తీసుకున్నారు. రెడ్డయ్యను కార్యాలయ సిబ్బంది, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కలిసి అభినందించారు.

అగ్ని బాధితురాలికి ఆర్థికసాయం అందజేత

ఉత్తరపాలెం(మోపిదేవి): బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఉత్తరపాలెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బాధితురాలు దోనే స్వరూపరాణి కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో రూ. 10 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు, బియ్యం, దుస్తులు, దుప్పట్లు బాధితురాలికి అందజేశారు. స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ, గ్రామ కన్వీనర్ మత్తి వెంకట రాజాచంద్, వార్డు సభ్యురాలు బడుగు నాగమణి, నాయకులు పాల్గొన్నారు.



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న శిక్షణ

అవనిగడ్డ: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, డ్యాన్స్, తెలుగు పద్యాలు చదవడం, పాటలు పాడటంలో శిక్షణ ఇచ్చారు. బి కృపారావు, వెంకటేష్, ప్రభుచరణ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి జె. ప్రభుదాస్ పర్యవేక్షించారు.

ఘంటసాలలో..

ఘంటసాల గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పుస్తక పఠనం, చిత్రలేఖనం, కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణకు హాజరైన విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ అందజేశారు. గ్రంథాలయ అధికారి ఎం. శరత్‌కుమార్ పర్యవేక్షించారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై గురువారం శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిన్నారులు భగవద్గీత శ్లోకాలను పఠించారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, లెక్కలు నేర్పించారు. కోలాటం నేర్పించి బెలూన్లతో ఆడించారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు. ఈడేపల్లి గ్రంథాలయంలో ఉపాధ్యాయుడు సత్యనారాయణ కథల పోటీలు నిర్వహించారు. సీనియర్ విద్యార్థులతో కథలు రాయించి, జూనియర్ విద్యార్థులతో కథలు చెప్పించారు. యోగా శిక్షకుడు సత్యనారాయణ విద్యార్థులతో ధ్యానం చేయించారు. చిలకలపూడిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో ఖోఖో ఆడించారు. పత్రికలు, కథల పుస్తకాలు చదివించారు. ఈడేపల్లి, చిలకలపూడి శాఖ గ్రంథాలయాల నిర్వాహకులు వెంకటేశ్వరమ్మ, సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.



ఈడేపల్లి గ్రంథాలయంలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

మట్టి తోలకాలను నియంత్రించాలి

నాగాయలంక: మండలంలో మట్టి తోలకాలు ఆందోళన కలిగిస్తున్నాయని, వీటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని నాగాయలంక జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు అన్నారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నాగాయలంక మండలంలో మట్టి తోలకాల నియంత్రణలో రెవెన్యూ యంత్రాంగం విఫలం కావడంపై తహసీల్దార్ జె.విమల కుమారిని నిలదీశారు. తహసీల్దార్ మాట్లాడుతూ అలాంటిది ఏమీ లేదని, రెవెన్యూ యంత్రాంగం పూర్తి పర్యవేక్షణ ఉంటుందని సమాధానమిచ్చారు. భావదేవరపల్లి, రేమాలవారిపాలెం, దిండి ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యలను మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరిశె అమ్మన్న, ఇతర సభ్యులు డ్రెయినేజీ ఏఈఈ చిరంజీవి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఏడాది కూడా రైతులకు సకాలంలో సక్రమంగా సాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని నీటి పారుదల శాఖ ఏఈఈ పొన్నూరు రవితేజ సభ్యులకు వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎస్సీ,ఎస్టీలకు అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ ఏడుకొండలు సూచించారు. అధికారులు సూచించిన అంశాలను రైతులు, ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి మేలు చేకూరేలాగా సహకరించాలని ఎంపీపీ రాఘవరాణి సభ్యులకు సూచించారు. మత్స్యశాఖాధికారి కార్యాలయాన్ని నాగాయలంక కేంద్రంగా ఏర్పాటు చేయాలని, కృష్ణానది ఒడ్డున నిర్మాణంలో ఉన్న సోర్ బెస్ట్ మత్స్య భవనం పూర్తి చేయాలని కోరుతూ ఎంపీటీసీ సభ్యులు లంకె శ్రీనివాసప్రసాద్, నాగిడి ఆదిలక్ష్మి, మోకా ప్రసాద్ తదితరులు ఎంపీపీకి వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో నూతన ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంఈఓ టీవీఎం రామదాసు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ విమలకుమారి

ప్రతిభకు పురస్కారం

లక్ష్మీపురం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరానికి చెందిన విద్యార్థిని కోనేరు గ్రీష్మ జేఎన్‌టీయూ– కాకినాడ స్థాయిలో సత్తా చాటింది. మంచి మార్కులతో యూనివర్సిటీలో ప్రతిభ చూపింది. కంచికచర్లలోని దేవినేని వెంకట రమణ–డాక్టర్ హిమశేఖర్ మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీస్‌లో 2017–21 విద్యా సంవత్సరంలో కోనేరు గ్రీష్మ ఈసీఈ కోర్సు పూర్తి చేసింది. 2021 సంవత్సరానికి ఈసీఈ విభాగంలో 9.22 జీపీఏ సాధించింది. తద్వారా గ్రీష్మ జేఎన్‌టీయూ కాకినాడ స్థాయిలో మంచి మార్కులు సాధించింది. 2021 నాటి జేఎన్‌టీయూ స్నాతకోత్సవం కోవిడ్ కారణంగా నిర్వహించలేదు. 2017–21, 2018–22 బ్యాచ్‌ల స్నాతకోత్సవం ఇటీవల యూనివర్సిటీలో ఘనంగా జరిగింది. ఈ వేదికపై యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీవీఆర్ ప్రసాదరాజు కోనేరు గ్రీష్మకు పురస్కారం, బంగారు పతకం ప్రదానం చేశారు. గ్రీష్మ ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం చేస్తోంది. గ్రీష్మకు పురస్కారం, బంగారు పతకం లభించటం పట్ల ఆమె తల్లిదండ్రులు కోనేరు శ్రీనివాసరావు–శారద హర్షం వ్యక్తం చేశారు.



యూనివర్సిటీలో పురస్కారం అందుకుంటున్న కోనేరు గ్రీష్మ